# ధర్మనిర్ణయం...

రచన :
యర్రమిల్లి చలపతిరావు.

చరిత్రప్రసిద్ధమయిన ఆగ్రాకోటలోని ఉద్యానవనం అంతా సాయంసమయపు సంధ్యారాగకాంతుల్లో శోభాయమానంగా, నేత్రపర్వంగా వుంది. సాయంసమయం ఆకాశం నిండా అలముకొనిన సంధ్యారాగ కాంతులు ప్రకృతికంతకూ బంగారు పూత పూస్తున్నయి. పక్షులు కిలకిలమంటూ గూళ్లల్లో చేరుకొంటున్నాయ్. అస్తమయభానుడు ఆదూరంగా కనబడే కొండలమాటున దాగొనబోతున్నాడు. సాయంసమయపు స్తబ్ధప్రకృతిలో దూరాన, యమునానదీతీరాన పచ్చిక బీళ్లనుండి తిరోగమిస్తున్న గోగణముల సవ్వడీ వాటిని అదలించే గోపాలకుల అదలింపులూ, దూరంనుంచివినవచ్చే శ్రవణపర్వమైన మురళీ స్వనాలూ, అప్పటి దృశ్యానికి ముఖ్యాలంకారాలు.

యమునాతీరంలోని పూతోటలో ఓజాజి పందిరిక్రింది సోఫాలో షాజహాన్ చక్రవర్తి కూర్చున్నాడు. షాజహాన్‌చక్రవర్తి బాహువుల్లో బంధింపబడి వుంది ముమ్‌తాజ్ బేగం. ఇద్దరూ ఒకరి హృదయాల్లోకి ఒకరు దూరిపోయి, హత్తుకొనిపోయిఉన్నారు. ముమ్‌తాజ్ బేగం కళ్లల్లోకి చూస్తు అన్నాడు ఫాదుషా.

"బేగం! పరమేశ్వరస్వరూపము, కళాఖండముఐన యీజగత్తు, యీప్రకృతి సౌందర్యముకంటె నాదృష్టిలో నువ్వే సౌందర్యరాశివిగా కనుపిస్తున్నావ్. ప్రకృతిలోని సౌకుమార్యం అంతా దొంగిలించి పొదిగినాడు సృష్టికర్తనీతనూవల్లరిని. నువ్వు మూర్తీభవించిన సౌందర్యఖనివి. ప్రపంచంలో నీకంటె సౌందర్యవతి లేదు. అట్టి నిన్ను నాదానిగా పొందగలిగినందుకు నేనెంతియూ గర్విస్తున్నాను. ప్రపంచంలో నీకంటె, నీ ప్రేమకంటె, అమూల్యమైనవస్తువేదీ నాకు లేదు. నీముందు త్రిభువనసామ్రాజ్య పీఠాన్నయినా సరే తృణకణాయమానంగా త్యజిస్తాను. నిరంతరం నీసాన్నిధ్యమే, నీ తీయటిమాటల శ్రవణానందమే, నీనునువెచ్చని కౌగిలియే, నీ తేనెలూరు మధురాధరామృతమే, యీ ఫాదుషాను నవయువకునిగా, శాశ్వత తేజస్విగా, దేవతాస్వరూపునిగా చేస్తుంది. నీతోటిదే నాలోకం. నువ్వేనేను నేనే నువ్వు. బేగం? యెప్పుడూ యిలాగే, అనిర్వచనీయమైన యీ అమరసుఖంలో, యీకమ్మని వెచ్చని కౌగిట్లో యిద్దరం, జీవితాంతంవరకూ ఉండిపోదాం."

ముమ్‌తాజ్ బేగం, ముఖంలో దరహాస చంద్రికలుదయించినయి. చిన్నచిరునవ్వు నవ్వి, "ప్రభువులకు నామీది అవ్యాజమైనప్రేమయే అలా అనిపిస్తుంది. లోకంలోని అనంతకోటి స్త్రీజనంలో నే నొక రేణువును. అంతేకాని నాలో ఉన్న ప్రత్యేకత యేమీ లేదు. ఇంత స్వచ్ఛమైన, నిష్కల్మషమైన, శాశ్వతమైన హృదయ పూర్వకమయిన ప్రేమను, భర్త ద్వారా పొందగలిగిన భాగ్యవంతురాల్ని యీప్రపంచంలో నే నొక్కర్తెనేనేమో అని కూడా నా అనుమానం."

"అవును బేగం. ప్రపంచంలో ఒక స్త్రీ, ఒక పురుషుడిమధ్యా నిజంగా అసలయిన ప్రేమ లేదు. మనబోటి పవిత్రప్రేమ ప్రపంచంలో మరి ఏదంపతులమధ్య ఉండదనేనావిశ్వాసం. ప్రపంచంలోని పవిత్రప్రేమ మనలనే వరించింది. మనమధ్యనే వుంటుంది. మనతోనే పోతుంది. కాని అహర్నిశమూ నన్నొక్క బాధ పీడిస్తోంది. ఆభయంనుండి విముక్తుణ్ణి అవలేకపోతున్నా ఎంత ప్రయత్నించినా."

"ఏమిటి ప్రభూ? ప్రభువులకు దేనిని గురించి అంత భయం?"

"ఏమీ లేదు బేగం? మన యిద్దరిలో ఏ వొకరికీ ముందు చావు రాకూడదు. అప్పుడీ ప్రపంచమే శూన్యం. విధి బలీయమై ఒకవేళ మనయిద్దరికీ ఎడబాటు సంభవించేయెడల-"

"తప్పు హుజూర్, అమంగళం వద్దు. ఆ మాట నేను వినలేను. అలా యెన్నటికీ జరుగదు. మన ప్రేమ బలవత్తరమయినది. శాశ్వతమయినది. దానికి యెడబాటులేదు. ఎల్లప్పుడూ, ఇలా ఈరమ్యోద్యానవనాల్లో, యీ చల్లగాలిలో, యీ పుష్పసౌరభంమత్తులో, యీ యమునాతీరంలో, యీ జాజిపొదల్లో ఒకళ్ల కౌగిట్లో, ఒకళ్లం, శాశ్వతంగా, అమర సుఖాన్ని పొందుదాం, మానవులకు ఇంతకంటె లభించగల అమరసుఖం యేముందీ స్వార్థప్రపంచంలో."

"నిజం బేగం. ఏదీ?......"అన్నాడు ఫాదుషా.

రెండు పెదవులూ కలుసుకొన్నాయ్. జాజిపూపొదమీంచి రెక్కలువిదుల్చుకుంటూ అభ్రవీధిలోకి ఎగిసిపోయింది ఒక గువ్వ. అయిదు నిముషాలు గడచినయ్. ఇద్దరూ లేచారు. పూపొదని తగిలించివున్న విల్లమ్ములు తీశాడు ఫాదుషా. 'రా బేగం! అలా నదీతీరంవరకూ పోయివద్దాం' అన్నాడు.

ఇద్దరూ నడచి ఉద్యానవనం కొసనున్న నదీతీరానికి వెళ్ళారు. దూరాన నదిలోకొంత మంది చాకళ్ళు బట్టలు ఉతుక్కుంటూ ఆరిన బట్టలు మూటకట్టుకుంటూ ఉన్నారు. చాకిరేవు పొయ్యిల్లోంచి పొగ పల్చగా వస్తోంది.

ఫాదుషా, విల్లమ్ములు, ముమ్‌తాజ్ బేగం చేతికిస్తూ, 'చూడు బేగం! శరప్రయోగంలో నీవెంత ప్రావీణ్యం సంపాదించావో చూడాలి. అదిగో, ఆ కనబడే మామిడిచెట్టుకొమ్మనున్న గుత్తి ఛేదించాలి. ఏదీ! ఛేదించి చూడు' అన్నాడు.

ముమ్‌తాజ్ బేగం, మందహాసంతో, వింట అమ్మును సంధించింది. ఆకర్ణాంతంలాగి శరాన్ని విడిచింది. శరం రంయ్ మని శర వేగంతో పోయింది. అయితే యేమయింది? గుత్తి రాలిపోయిందా ? అనుకున్నదొకటీ అయినదొకటీ అయింది. మామిడికాయలగుత్తి రాలిపోవడానికి బదులుగా పాపం, అక్కడే ఆరినబట్టలు మూటకట్టుకుంటూన్న చాకలి కుర్రాడి గుండెల్లోంచి దూసుకుపోయింది,



గుత్తిరాలిందేమోనని ఇద్దరూ కళ్లెత్తి చూశారు. "అమ్మో...అబ్బా" అని రెండు కేకలు వినిపించాయ్. దెబ్బతిన్న రజకయువకుడు భూమిపైబడి కొట్టుకొంటున్నాడు. ఇంకేం ఉంది? చాకలికుర్రవాడి భార్య ఏడుస్తూ పరుగెత్తివచ్చింది. ఆమె పసుపు బట్టలు ధరించివుంది. కారణం? వాళ్లిద్దరికీ పెళ్లీ, కార్యం, అన్నిఅయి పదిహేను రోజులైనా పూర్తిగా గడవలేదు. చాకలివాడి భార్య మహాఘోరంగా దుఃఖిస్తూ, నారాజా నన్నిడిచి ఎల్లిపోయావా? ఏ వేదవకొచ్చింది ఈపోగాలం? వాడి పెళ్లాం నాలా ఎప్పుడేడుస్తుందో? ఇంక నాకేటి దిక్కు? నేనెలా బతకను? అబ్బ నారాజా ? కార్యంఅయి పదిహేను రోజులైనా నిండాకాలేదే? అప్పుడే మన బ్రతుకు అంతమయిపోయిందా? చాకల్ది వికటంగా రోదిస్తూ, భయంకరంగా తలంతా విరియబోసుకొని, భర్త శవంమీదపడి దొర్లి యేడ్వసాగింది. చుట్టూ చాలమంది జనం మూగారు. జనంలోంచి యెవరో అన్నారు. "ఫాదుషా అయితేమాత్రం, ఇలా చేస్తాడా? రాజు రాణీల విలాసానికి ఒక సామాన్య పౌరుని జీవితం బలియా? ఛీ దుర్మార్గం నశించాలి. దౌర్జన్యం నశించాలి. పదండి ఫాదుషాని అడుగుదాం? ఇలా ఎంతమందిని తమ వినోదానికి బలిచేస్తాడో? పదమంటే పదమన్నారు. జనం అంతా కోటగుమ్మందగ్గిరకొచ్చేరు. కోట సింహద్వారానికి ఎదురుగానే వుంది ధర్మఘంట. ఫాదుషారాజ్యంలో ఏ సామాన్యపౌరునికి అన్యాయంజరిగినా, అతడు స్వయంగావచ్చి ఆ ఘంట మ్రోగించినట్లయితే, ఫా దు షా స్వయంగా వచ్చి న్యాయం విచారిస్తాడు. షాజహాన్ చక్రవర్తి ధర్మమూర్తి అని ప్రతీతి. అతని రాజ్యంలో అన్యాయం, దౌర్జన్యం, దొంగతనాలూ లేవు. నేరంచేసినవాళ్ళు కఠినంగా శిక్షింపబడతారు. ఫా దు షా రాజ్యంలో ఒకడు ఎవణ్ణయినా ఖూనీచేసినా ఒకవ్యక్తివల్ల మరొకవ్యక్తి మరణించినా, మరణానికి కారణమయిన వ్యక్తికి మరణదండనయే. అది శాసనం !

చాకలివాడి భార్య ఆవేశంతో ఘంటను పట్టుకుని లాగుతూంది. ఘంటానాదం కర్ణకఠోరంగా ధ్వనిస్తుంది. జనం కిటకిటలాడుతున్నారు. అందరి మొఖాల్లోనూ, ఆశ్చర్యం, భయం, పట్టుదలా ప్రతిఫలిస్తున్నాయ్. ఎవరికివారే ఏమవుతుందో నని చూస్తున్నారు.

అప్పుడే సింహద్వారకవాటం కిర్రుమని తెరచుకొంది.

నిశ్చలమైన విచారంగుప్తమైన, గంభీరమయిన ముఖంతో ఫాదుషా నడిచివచ్చాడు. ఏమిటని అడిగాడు. చాకల్ది రోదిస్తూ అంది.

"ప్రభూ, ప్రభువుల వినోదానికి ప్రజల్ని బలిచేస్తారా? మీది ధర్మరాజ్యం అని ప్రతీతి! మీరు ధర్మమూర్తులట! అటువంటిది నూరేండ్లు బ్రతుకవలసిన నా జీవితాన్ని నాశనం చేసి, నా భావిసుఖాన్ని మొదలంటా శాశ్వతంగా త్రుంచేసి మీబాణానికి నాభర్తను ఎరజేస్తారా? భారత స్త్రీకి భర్తతోటిదే లోకం గదా? ఇక నేనెలా బ్రతకను? బ్రతికి ఏం ప్రయోజనం? దీనికి ఎవరు బాధ్యులు ? ఈ ఘోరానికి ఎవరు శిక్షింపబడాలి? ఎవరు శిక్షార్హులో మీరే నిర్ణయంచేయండి. నా హృదయం దహించుకుపోతోంది. నాభర్తను చంపిన ఆ దుర్మార్గుడికి అతడెవడయినాసరే, కఠిన శిక్ష విధింపబడవలసిందే" అన్న దామె. అంతా నిశ్శబ్దం. ఫాదుషా మౌనం వహించాడు. తను ఏం చెయ్యాలి? నిజంగా తన భార్య అమ్మవల్లనే ఆమె భర్త చనిపోత. తనరాజ్యంలో తనచే నిర్ణయింపబడిన, ధర్మశాస్త్రప్రకారం, తనభార్య తప్పక శిక్షార్హురాలే. కాబట్టి న్యాయశాస్త్రప్రకారం తన ముమ్‌తాజ్ బేగానికి......శిక్ష విధింపవలసి ఉంటుంది. ఏశిక్ష — ఉరి ?......ఫాదుషా తృళ్లిపడ్డాడు. అతనిబుర్రలో దిక్చక్రం అంతా భయంకర జీమూతంతో కప్పట్టింది. దేన్నయినా సహిస్తాడుగాని తనభార్య కాలికి ముల్లు గుచ్చుకున్నదంటే ఫాదుషా సహించలేడు. ప్రపంచంలో అన్నిటికన్నా, ఆఖరికి తనకన్నా భార్యమీదే యెక్కువ ప్రేమ ఫాదుషాకి. అటువంటప్పుడు ఫాదుషాభార్యకి

శిక్ష విధించగలడా? అసంభవం ? అయితే న్యాయం? ప్రపంచం అంతా తన్ని నీతిదూరునిక్రిందా, కాముదానునిక్రిందా దూషిస్తే, కవుల రాతల్లో సూర్యచంద్రాదు లున్నంతకాలం అపకీర్తి మోస్తూ బ్రతకడమేనా? ఏది దారి ?

ముందు నుయ్యి వెనుక గొయ్యి అయింది ఫాదుషా పని.

ఫాదుషా, ఏం చెప్తాడో అని ప్రజలంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. ఫాదుషా అన్నాడు, "చూడు అమ్మాయి? నీభర్త మరణించాడు. అతని మరణంతో నీ జీవితం సర్వనాశనం అయింది. ఇక నీకు జీవితమనేదిలేదనీ, జీవచ్ఛవానివనీ నాకు తెలుసు. ప్రేమ బలం ఎటువంటిదో, వియోగం యెటువంటి ఘోరమయినదో నాకు తెలుసు. మరణించిన నీభర్త ఇక మరలి, ఏవిధంగానూ రాలేడన్న విషయాన్ని నీవు మరచిపోగూడదు. ఒక వ్యక్తి నిర్లక్ష్యమువల్ల నీభర్త నిండుజీవితం నాశనం అయింది కాబట్టి, ఆవ్యక్తి నిజంగా మరణ దండనకు అర్హుడు. నా పట్టమహిషి ముమ్‌తాజ్ బేగంయొక్క పొరపాటువల్లనే నీభర్త మరణించాడు. కాబట్టి న్యాయశాస్త్ర ప్రకారము నాపట్టమహిషి, ముమ్‌తాజ్ బేగానికి ఉరిశిక్ష విధించవలసి ఉంది. అయితే నా భార్యను ఉరిదీసినట్లయితే, నీభర్త తిరిగి లేచి రాడు గనుకా, నీభర్తను పొట్టబెట్టుకొని నీ జీవితలతను మొదలంట తెగగోసిన, ఆ ముమ్‌తాజ్ బేగంయొక్క భర్తను, ఈ ఫాదుషాను నువ్వు నీచేతులతో, విల్లమ్ములుతీసుకొని, ఈ యావన్మంది అశేష ప్రజాసమూహంయెదుట, వధించు. అప్పుడు భర్తృహీనవై నువ్వు పొందే దుర్భరజీవితానికి, సమానంగానే నీ భర్త చావుకు కారణమైన ఆస్త్రీకూడా వ్యధపొందుతుంది. అప్పుడిద్దరూ సమానఫలితాన్ని పొందుతారు. అప్పుడు నీ ఆత్మ శాంతిస్తుంది. అంతే కాని కేవలం ఆమెను చంపితే, నీకు ఆత్మశాంతి కలుగదు. ఊ—చూస్తావేం ? ఇవిగో విల్లమ్ములు, నీభర్తను చంపిన పాతకురాలి భర్తను నువ్వు చంపి న్యాయాన్ని కాపాడు. ఇదే నా ధర్మనిర్ణయం?" అని గర్జించాడు ఫాదుషా. జనం అంతా ఒకళ్లమొఖాల్లోకి ఒకళ్ళు చూసుకుని తెల్లబోయారు.

ధర్మమూర్తులు, న్యాయమూర్తులు, షాజహాన్ చక్రవర్తి ధర్మము ! న్యాయ్‌జిందాబాద్ అని కేకలువేశారు.

"ప్రభూ ! క్షమించండి. యౌవనంలో జోడు పోయిన దుఃఖంతో ఆవేశంతో ఏమో అన్నాను. నేనుమాత్రం ప్రభువుల్నీ, ప్రభువుల విశాలహృదయాన్ని యెరుగనా ? ప్రభువులు ధర్మమూర్తులు. అయినదేదో అయింది. పొరపాట్లు ప్రతివారికీ సహజం. ప్రభువులు యీవిషయంలో విచారించరనే భావిస్తాను" అంది చాకలి. చాకలినోరు మూతపడింది. ఫాదుషాకు నమస్కరించి వెళ్ళిపోయింది. వచ్చిన ప్రజలంతా ఏమి ధర్మమూర్తి? అనుకుంటూ వెళ్ళిపోయారు.

క్రమంగావారాలూ, నెలలూ, గడచాయ్.

ముమ్‌తాజ్ బేగం జ్వరంతో మూల్గుతూ పండుకొంది పందిరి మంచంమీద, ఆమెకు ప్రక్కగా చెమ్మగిల్లినకళ్ళతో ఫాదుషా కూర్చునివున్నాడు.

'బేగమ్? వంట్లో ఎలా వుంది?' అన్నాడు కళ్ళల్లో చూస్తూ.

'ప్రభూ! యౌవనంలోని జోడుని విడదీశాను. ఆమె భర్తలేని జీవితం వృధా దుర్భరం. ఆజీవితంయొక్క బాధ నాకు తెలుసు. ఆమె శాశ్వత నరకసదృశజీవితానికి నేనే కారణం అయినాను'



ఆమె జీవితం సర్వనాశనం అయింది. ఇక నేను బ్రతుకను. నా బోటి పాపిష్టురాలు బ్రతుకకూడదు.'

'అలాంటిమాటలనకు బేగమ్? ఏదో పొరపాటయింది, నువ్వు లేకపోతే నేనుమాత్రం బ్రతుకగలనా? నువ్వేగా నా జీవన సంధ్యాజ్యోతివి. తప్పు అలాఅనకు. అదుగో కళ్లంట నీళ్ళు పెట్టుకుంటున్నావ్. బేగం నేను చూడలేను. నాగుండె తరుక్కుపోతుంది. యాఖుదా? మాకెటువంటి బాధలు తెచ్చిపెట్టావు?' బావురుమన్నాడు షాదుషా.

మరి నాల్గురోజులు గడచాయ్. హకీమ్ వచ్చి క్షయజబ్బని చెప్పి వెళ్లిపోయాడు. దుస్సాధ్యం అనికూడా అన్నాడు. ముమ్‌తాజ్ బేగం బాధగా మూల్గుతూంది. షాదుషా ప్రక్కలో కూర్చున్నాడు.

'హుజూర్!' అంది ముంతాజ్ బేగం?

'బేగం? ఏమిటీ?' అన్నాడు షాదుషా.

'చూడండి. నేను చిరశాంతిమయ లోకానికి వెళ్లిపోతున్నాను. ఇక బ్రతకను. ఏదీ? మీచెయ్యి ఇలా ఇయ్యండి.'

షాదుషా చెయ్యి ఇచ్చాడు.

అతని హస్తాన్ని ఆమె గుండెలమీద పెట్టుకొని అతని కళ్ళల్లోకి చూస్తూ, అంది ముమ్‌తాజ్ బేగం.

'చూడండిప్రభూ, మరణశయ్యమీదనుండి మిమ్మల్ని రెండేరెండు కోరికలు కోరుతున్నాను. తప్పక చెల్లిస్తారనే ఆశిస్తున్నాను.'

"ఎంతమాట బేగం తప్పకుండా ఏమా కోరికలు? అన్నాడు షాజహాన్. అతనికండ్ల వెంబడి రెండు వేడి కన్నీటిబొట్లు ఆమె చెక్కులమీద పడ్డాయ్.

'ప్రభూ! నన్ను ముద్దుపెట్టుకున్న పవిత్రమయిన మీ పెదవుల్తో మీరు మరో స్త్రీని ముద్దుపెట్టుకోగూడదు. అలాచేస్తే స్వచ్ఛమైన స్వర్గంలోని నా ఆత్మ సహించదు. రెండవది—నాపేరు ప్రపంచంలో చిరస్థాయిగా ఉండిపోయేలాగు ఏదైనా ఒక చిహ్నం నెలకొల్పడం...యివి రెండే నేను కోరేది. నెరవేరుస్తారా?" అంది.

'తప్పకుండా బేగం. భగవంతుడిసాక్షిగా' అన్నాడు షాదుషా. భర్తహస్తాన్ని గుండెల్లో యిముడ్చుకుని, భర్తఒళ్ళో తలపెట్టుకుని, భర్తముఖంలోకి చూస్తూ ప్రాణాలు విడిచింది. పవిత్ర ప్రేమమయి. ఆదర్శనారి. ముమ్‌తాజ్ బేగం? అంతకంటె యేంగావాలి? అసలైన స్త్రీకి?

వరుసగా యిరవై సంవత్సరాలు కాలచక్రంలో గిర్రున తిరిగిపోయాయ్.

యమునానదీ తీరాన చలువరాతితో, భూలోకంలో వెలసిన స్వర్గధామంలాగా, ప్రపంచంలోని పవిత్రప్రేమికుల చిహ్నంగా, ఒక దివ్యసుందర భవనం అవతరించింది. 20 వేల మంది పనివాళ్ళు యిరవైకోట్ల రూపాయల ఖర్చుతో, ఇరవై సంవత్సరాలు పడిన శ్రమఫలితం, తాజ్‌మహల్? అబ్బ! ఎటువంటి అమర చరిత్ర? ఏమంటారు?

షరా:—ఈ రచన ఏ ఆధారంపైననూ వ్రాయలేదు. స్వంత రచనయే.

---

# వలపు...!

— రచన: గండిరాజులు —

●

పొన్నచెట్టూమీద
పొందుగా కూర్చున్న
వెన్నదొంగానాదు
మనసు నీపైనుండెరా!
సరసుడా!
మనసొల్లాసముగూర్పరా!

ఆలమందలుగాసి
పాలుపెరుగూద్రావి
అట్టెకూర్చుంటేను—
అట్టుడికినట్టుడికెరా!
నామనసు—
గుట్టునీపైనాయెరా!

పిల్లనగ్రోవిలోన
ప్రేమగీతామృతం
పలుకుపైకొస్తుంటె
పులకరిస్తున్నాదిరా!
నామేను—
పున్నెముంటది పల్కరా!

నాధ! నీపై మక్కు
వధికమగుటంజేసి
అన్నపానంబులం—
దాశ, లేశములేదురా!
మాధవా!
గాసిజెందకబ్రోవరా!

మోహనాంగా! నాదు
ముచ్చటం దీర్పకుం
డచ్చటేయుంటేను
చిచ్చులో బడతానురా!
నామనసు—
చిచ్చులో కచ్చికారా!

